కథ

# ఫ్లాష్ !

- నడిమింటి జగ్గారావు

**చంద్రశేఖర్ ముభావంగా ఉండడం అతని భార్య ఇందిర గమనించింది.**

**"ఎందుకు మీరు అదోలా వున్నారు ?"**

**"ఏం లేదు"**


**"కాదు ఏదో ఉంది"**

చాలాసేపు బ్రతిమాలితే, భార్య దగ్గర దాపరికం తెలియని చంద్రశేఖర్ తన మనసులో మాట బయట పెట్టాడు. అది విన్న ఇందిర నిర్ఘాంతపోయింది.

✤ ✤ ✤

మర్నాడు ఇందిర, తన స్నేహితురాలైన మిసెస్ భాస్కర్ దగ్గర తన బాధ వెళ్ళబోసుకుంది. మిసెస్ భాస్కర్ ఇందిర చెప్పినదంతా ఆసక్తిగా, జాగ్రత్తగా విన్నది. ఆమె భర్త సైకాలజీలో ప్రొఫెసర్ కావడం వల్ల, అతనితో పాతికేళ్ళ బట్టి కాపురం చేస్తున్న ఆమెకి కూడా కొంత శాస్త్ర సంభాషణ అలవడింది. మనస్తత్వ శాస్త్రపు సంగతులు మిసెస్ భాస్కర్‌కీ పట్టు బడ్డాయి.

"చూడు ఇందూ. ఏం భయపడకు. మగవాళ్ళకి ఈ నడివయసు చాలా ప్రమాదకరమైనది. పెళ్ళయిన కొత్తలో వుండే ఉడుకూ, ఉద్రేకమూ, ఈ వయసు రాగానే కొంత తగ్గుముఖం పడతాయి. పిల్లలు పుట్టడం, బాధ్యతలు మీద పడడం, పిల్లల చదువులూ ఆరోగ్య సమస్యలూ, సంసార బాధ్యతలూ, చాలినంత సంపాదన లేకపోవడం, అదనపు ఆదాయం కోసం అదనంగా పని చెయ్యడం, తద్వారా వచ్చే అలసట, నిస్త్రాణ భార్యతో భర్తగా ఎక్కువ సమయాన్ని గడిపే అవకాశాన్ని కోల్పోవడం...ఇలా. అదే సమయంలో ఇంకొక స్త్రీతో పరిచయం ఎంతో థ్రిల్ కలిగిస్తుంది. ఆమె అందచందాలు గానీ, గుణగణాలు గానీ, మంచి చెడ్డలు గానీ కంటికి కనిపించవు. మగవాడికి జీవితమంతా కేవలం 'అవకాశం' ఉండడం, అవకాశం లేకపోవడం, అంతే, అవకాశం లేకే భార్యకీ, సంసారానికీ కట్టుబడి వుంటాడు కానీ, ఆ అవకాశం అన్నది దొరికితే మాత్రం సహజసిద్ధమైన తన 'మగ' లక్షణాన్ని ప్రదర్శిస్తూనే వుంటాడు.; మీ ఆయన విషయంలో జరిగినది అదే. మరేం ఖంగారు పడకు. ఇదంతా తాత్కాలికం. కొన్నాళ్ళు అంతే. ఇంకో సంగతి తెలుసా ? ఎంత తొందరగా ప్రలోభానికీ, వ్యామోహానికీ లొంగిపోతారో, ఆవ్యామోహం తొలగిపోగానే అంత తొందరగానూ మామూలు మనుషులైపోతారు. నువ్వు దిగులు పడకు." చిన్నసైజు లెక్చర్ ఇచ్చింది సైకాలజీ ప్రొఫెసర్ భార్య అయిన మిసెస్ భాస్కర్. వింటున్న ఇందిర అసహనంగా కదిలింది.



"నీ విశ్లేషణ బాగానే వుంది. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి ? నేనేమైనా యాక్షన్ తీసుకోవాలా వద్దా ?" ఆవేశంగా అడిగింది.

"నేను చెప్పేదేంటంటే ...."

"నువ్వు చెప్పేదేంటో నాకు అర్థమయింది. నేను చెబుతున్నదే నీ చెవిలో కెళ్ళడంలా, నువ్వు చెప్పిన శాస్త్రం బాగానే వుంది. కానీ ఇలాంటి వ్యవహారాలన్నిటిలోనూ కట్టుకున్న భార్య పరిస్థితి ఏంటి ? కళ్ళూ, చెవులూ మూసుకోవాలా ? లేక సతీసుమతి లాగా ఎత్తుకుని తీసుకెళ్ళి ఆ గర్ల్‌ఫ్రెండ్ ఒళ్ళో కూలెయ్యాలా ?" ఇందిర

కోపం నిముషానికో డిగ్రీ ఛొప్పున పెరుగుతోంది.

" ఆరెండు పన్లూ నువ్వు చెయ్యవు. నాకు తెలుసు. కానీ ఓ మాట అడుగుతాను సమాధానం చెప్పు, నువ్వు మీ ఆయన్ని ప్రేమిస్తున్నావా ? లేదా ?"

"ప్రేమిస్తున్నాను. అందుకే నాకు ఒళ్ళు మండిపోతోంది !"

"ప్రేమిస్తే మీ ఆయన సంగతి నీకే బాగా తెలిసుండాలే. నా విశ్లేషణలూ, సలహాలూ ఎందుకు?" ఇందిరని ఛాలెంజ్ చేస్తున్నట్లుగా అడిగింది మిసెస్ భాస్కర్.

"అంటే ? "

"అంటే... మీ ఆయన పక్క చూపులు చూడడం మొదలు పెట్టాడూ అంటే నెమ్మదిగా నీకు దూరమౌతున్నట్టే కదా ! మరి ఆ విషయం ఇన్నాళ్ళూ నీకు గ్రహింపుకి రాలేదంటే నిన్ను ఏవనాలి ?"

"నువ్వే చెప్పావుగా మగబుద్ధి సంగతి ! వీళ్ళకి సంతృప్తి అనేది వుండదు. ఇన్నాళ్ళూ మా ఆయన శ్రీరామ చంద్రుడనుకున్నాను కానీ ఆయనా అందరి లాంటి వాడేనని తెలుస్తున్న కొద్దీ నాకు అరికాలి మంట నెత్తికెక్కుతోంది "? ఆపాదమస్తకం ఉగ్రకోపంతో ఊగిపోయింది ఇందిర. ఒక పక్క భర్త ఇలాంటిపని చేస్తున్నాడే అన్న బాధ, ఇంకోపక్క ఆ బాధను ఇంకొకరికి చెప్పుకోవలసి వచ్చిందే అన్న బాధ. జోడు రంపాలతో మనసుని పరపరా కోస్తున్నట్టు అని పిస్తోంది ఇందిరకి.

"ఇంతకీ, ఎవరా అమ్మాయి ?"

"అమ్మాయా ?! ఇంకా నయం ! చిన్న పాపాయన్నావు కాదు." మూతి నిరసనగా తిప్పుతూ మాటని విరిచింది ఇందిర.

"ఎంత వయసుంటుందో !" మిసెస్ భాస్కర్ విచారణ.

"నలభై !" పరాయిస్త్రీ వయసుని అంతకన్న తక్కువ ఏ స్త్రీ చెప్పదు.

" అలాగా ! ఇంకా ఏవి ఆకర్షణబ్బా ! " తనుకూడా సాధారణ స్త్రీ అయిపోతూ స్పందించింది మిసెస్ భాస్కర్.

- ఇందిర మనసు నిగ్రహాన్ని కోల్పోతోంది.

"నువ్వు నిలదియ్యాలా ?" అడిగింది మిసెస్ భాస్కర్.

"ఆయనా మాట చెప్పగానే నా మనసు మొద్దు బారిపోయింది. ఇంకా నిలదియ్యడం కూడానా ?"

"అదేంటలా చేశావు ? వెంటనే ఏదో ఒక చర్య తీసుకోకపోతే ఇంతే సంగతులు. ఇప్పుడు చూడు. అప్పుడే దాదాపు పద్దెనిమిది, ఇరవై గంటలు గడిచిపోయాయి. నీనుంచి ఏరియాక్షనూ లేకపోతే మీ ఆయన ఎలా అర్థం చేసుకుంటాడు ? నీ మౌనాన్ని అతను అంగీకారంగా అర్థం చేసుకుంటే ?" మిసెస్ భాస్కర్ ఇందిరని తగు మోతాదులో భయపెట్టింది. వింటున్న ఇందిర బుర్రంతా తిమ్మిరెక్కి బ్లాంక్ గా ముఖం పెట్టి -

"అంగీకారంగా అర్థం చేసుకుంటే ? - ఏం చేస్తారు ?!"

"నువ్విలాగే నిమ్మకి నీరెత్తినట్టుంటే ఇంక అతనికి భయమెక్కడుంటుంది ? నువ్వలా ఆశ్చర్యపోతూవుండు - అతను ఓ మంచిరోజు చూసుకుని ఆ అమ్మాయిని సారీ - ఆ ఆవిణ్ని, తిన్నగా ఇంటికే వెంట బెట్టుకుని వచ్చేస్తాడు. నువ్వు హారతి పళ్ళెం పట్టుకుని గుమ్మంలో ఎదురు చూద్దువుగాని, కుడికాలు పెట్టి రమ్మని చెప్పడానికి !" - అవసరమైన దాని కన్నా ఎక్కువ ఆవేశపడిపోయింది మిసెస్ భాస్కర్.

వింటున్న ఇందిరకి కంపం మొదలయింది. నమ్మిన కాళ్ళకింది భూమి క్రుంగిపోతున్నట్టూ, గదిగోడల నాలుగు వైపుల నుంచీ దగ్గరవుతూ తనని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నట్టూ, మోసపోతున్న తనని ఎవరో ఎగతాళి చేస్తున్నట్టూ అన్పించసాగింది. ఒక నిర్ణయానికి వచ్చిన మనిషిలా ఒక్క ఉదుటున లేచి నిల్చుంది. ఆవేశం వల్ల ఆమె ఉఛ్వాస నిశ్వాసాలు గదిలో ప్రతిధ్వనిస్తున్నాయి. అది చూస్తున్న మిసెస్ భాస్కర్ -

"ఇందిరా ! ఏంటా ఆవేశం ! ఒళ్ళు తెలియని ఆవేశంతో ఏపనీ చేయడం మంచిది కాదు. నిదానించు ఏం చెయ్యాలో కూల్‌గా ఆలోచించి చేద్దాం !" అంది.

"కూల్‌గా ఆలోచించి చెయ్యడానికి ఈ సమస్య

మీకెవరికో కాదు. నాది ! మీకేం ? మీరు కూల్‌గానే ఆలోచిస్తారు. అనుభవిస్తోంది నేను కదా ...!" తాగుతున్న కాఫీ కప్పును టక్కుమని టీపాయ్ మీద పెట్టి బయటికి నడిచింది ఇందిర.

భర్తమీద కోపం తగ్గకుండా వుండడానికి ఉదయం నుంచీ ఏమీ తినని ఇందిరకి ఆ కోపం ఇంకా ఎక్కువవుతోంది. దానికి తోడు నీరసం. ఇంటికొచ్చిన ఇందిర అలవాటుగా రాత్రి వంట పూర్తి చేసి కోపావేశాన్ని తగ్గిపోనివ్వకుండా కాపాడుకుంటూ కూర్చుంది 'మగబుద్ధి, మగబుద్ధి' అని గొణుక్కుంటూ, రాత్రి తొమ్మిదవుతుండగా ఎంతో అలిసిపోయినట్టు అగుపిస్తూన్న చంద్రశేఖర్ ఇంటికొచ్చాడు. మనిషి పదిలంఖణాలు చేసిన వాళ్ళా వున్నాడు. ఉదయం ఆఫీసుకి వెళ్తున్నపుడు హుషారుగా వున్న భర్త సాయంకాలానికి కళావిహీనంగా కనిపించే సరికి ఇందిరకి ఆదుర్దా, కుతూహలమూ ఎక్కువయ్యాయి. కానీ అతని మీద ముందు రోజు రాత్రి నుంచీ పెంచుకుంటూ వస్తున్న క్రోధాన్ని ఒక్కసారిగా వదిలిపెట్టే ఉద్దేశ్యం ఏమాత్రమూ లేని ఇందిర డైనింగ్ టేబుల్ మీది వంట పాత్రల్ని పెద్దగా శబ్దం చేస్తూ సర్దుతూ భర్తని ఓ కంట గమనిస్తోంది. సోఫాలో కూలబడిన చంద్రశేఖర్ ముఖం భరించలేని బాధని ఆపుకుంటున్నట్లుగా ముడుచుకుపోయి వుంది.

పూర్తిగా అరగంట నిశ్శబ్దం తర్వాత ఇక భరించలేని ఇందిర, జరిగిన దంతా మరచిపోయి భర్తపక్కకి చేరింది. ఆమె రాకని గమనించే స్థితిలో లేని చంద్రశేఖర్ తన ఆలోచనల్లో తానున్నాడు. ఇందిర అతని జుట్టులోకి తన చేతివేళ్ళు పోనిచ్చి, బిగించి పట్టుకుని అతని ముఖాన్ని తనవైపుకి తిప్పుకుంది. చంద్రశేఖర్ కళ్ళలో నీళ్ళు అతడు తల ఎత్తడంతో బుగ్గల మీదుగా జారి పడ్డాయి. ఇందిర తన కోపాన్ని పూర్తిగా మరచిపోయి కంగారుగా అడిగింది -

" ఏమయింది చందూ !! ఎందుకలా వున్నావు ? ఏవయింది ?"

చంద్రశేఖర్ ఆమెను అలాగే పొదువుకుని ఆమె పొట్టమీద తలవాల్చి ఏడ్చేశాడు. ఇందిర పూర్తిగా బెదిరిపోయింది -

"చందూ ! ఎవరికేమయింది ? నాకు చాలా భయంగా వుంది. వెంటనే చెప్పు, ఎనీ బ్యాడ్‌న్యూస్ ? అందరూ బానే వున్నారు కద !?"

చంద్రశేఖర్ ఒక గొప్ప విజయవంతమయిన మహప్రయత్నంతో తనను తాను సంభాళించుకున్నాడు-

"అందరూ బానే వున్నారు, ఏం వర్రీ అవకు"

"మరి ? ఆఫీసులో ఏదేనా ప్రాబ్లమా ?" ఇందిరకోపం ఎటుపోయిందో ఆమెకే తెలియలేదు.

"అబ్బే అదేం కాదు. సంగతి వింటే బహుశా నీకు ఈ ఆదుర్దాపోయి మళ్ళీ అసూయా, కోపమూ ఎక్కువవుతాయేమో !" తన సహజ చమత్కార సంభాషణలోకి మారిపోతూ చెప్పాడు చంద్రశేఖర్. అతనిలో క్షణం క్రితం కనబడిన తీక్షణమైన బాధనీ, అంతలోనే చోటు చేసుకున్న సంపూర్ణమైన మార్పునీ గమనించిన ఇందిర ఆశ్చర్య చకితురాలైంది.

"ఇంతకీ ఏవయిందో చెప్పండి. నాకోపమూ, అసూయలతో మీకేమిటి సంబంధం ?" చనువుగా ఉన్నపుడు ఏకవచనం లోనూ, మిగిలిన సమయాల్లో తాము ఇద్దరే వున్నా గౌరవసూచకంతోనూ మాట్లాడే ఇందిర అతన్ని తాను ఉంచదల్చుకున్నంత దూరంలోనే వుంచుతూ అడిగింది. చంద్రశేఖర్ నాంది, ప్రస్తావనలు లేకుండా సూటిగా ప్రారంభించాడు.

" అబ్బే మరేం లేదు. నిన్నరాత్రి నీకు చెప్పానే ఒకావిడ గురించి ...! "

"ఇప్పుడావిడ గురించి ఎందుకు ? మళ్ళీ నన్ను బాధ పెట్టాలా ? ఏం, అంత మరిచిపోలేక పోతున్నారా? అయినా ఇవాళేవయిందని నేను ఇంత గాభరా పడుతుంటే, మళ్ళీ అప్రస్తావన ఎందుకు ?"

"అదికాదు ..."

"మీకు ఎప్పుడు ఏం మాట్లాడాలో తెలీదు"

"తెలుసు. ఇవాళ మధ్యాహ్నం అబిడ్స్‌లో జరిగిన ఆక్సిడెంట్‌లో ఆవిడ చనిపోయింది. అది చెబుదామనే...!?

"మైగాడ్ !" స్టన్ అయిన ఇందిర ఆశ్చర్యంగా చంద్రశేఖర్‌ని చూసింది. " ఏమిటీ మనిషి ! నిన్నటి వరకూ అంత వ్యామోహానికీ, ఆకర్షణకీ లోనయి, ఈక్షణంలో

ఇంత నిర్లిప్తంగా, ఏ ఉద్వేగమూ లేకుండా మాట్లాడుతున్నాడే ! రెండు నిముషాల క్రితం భోరుమని ఏడ్చిన మనిషి, ఇప్పుడు ఇంత స్వచ్ఛంగా ఏమీ జరగనట్టు ఇదంతా మామూలు విషయం అన్నట్టు ఎలా వుండగల్గుతున్నాడు ! మగవాళ్ళ బుద్ధి అంత చంచలమా? కాంక్ష ఇంత తాత్కాలికమా ?

చంద్రశేఖర్ మనసు దోచుకుని, అంతలోనే మాయమైన ఎవరో తెలియని ఆస్త్రీమీద వర్ణనకందని జాలి కలిగింది. ఇందిర హృదయం ఆ స్త్రీని తల్చుకుని ద్రవించి పోయింది. కట్టుబాట్లకీ, సంఘనియమాలకీ, హద్దులకీ సామాజిక పరిస్థితులకీ అతీతమైన, సర్వస్వతంత్రమైన ప్రేమావేశానికి తాత్కాలికంగా అయితేనేం, చంద్రశేఖర్‌ని గురి చెయ్య గలిగి, అంతలోనే ఏప్రేమలూ, ఆవేశాలూ అవసరం లేని అనంతతీరాలకి ఎగిరిపోయిన ఆమె గురించి చెప్పలేని బాధ కలిగింది.

'ఎన్ని ఊహించుకుందో ! ఎన్ని కలలు కన్నదో ! ఎన్ని కాంక్షల శ్రీ గంధాలుమై నలదికొందో ! ఎన్ని ఎదురు చూపుల్ని తోరణాలుగా యెద గవాక్షంలో కట్టుకుందో ! పావం ! ఏవీ జరగకుండానే, తీరకుండానే, పొందకుండానే, అర్థాంతరంగా హడావిడిగా, అకాలంగా, నిష్కారణంగా నిష్క్రమించింది ?

నిర్వికారంగా సోఫాలో వెనక్కివాలి కూర్చున్న భర్త చంద్రశేఖర్ మీద ఇందిరకి చెప్పలేనంత కోపం తన్నుకొస్తోంది. అంతవరకూ తనను తీవ్రమైన ఆవేశానికీ, అసూయకీ, గురి చేసిన ఆ అపరిచిత స్త్రీమీద అవ్యాజమైన ప్రేమ కలిగింది. జాలి కలిగింది. ఆ చనిపోయిన వ్యక్తిని తల్చుకుంటున్న కొద్దీ ఇందిరకి ఆపుకోలేని దుఃఖం ఉబికింది. ఇందిర కళ్ళల్లో పొంగుతున్న నీళ్ళని చూసి చంద్రశేఖర్ అంటున్నాడు.

"చూడూ, నువ్వెందుకు విచారిస్తావు? ఏమైనా బాధ ఉంటే నాకుండాలి. ఐయామ్ ఆల్‌రైట్, సో, బీ హ్యాపీ !"


ఇందిర మాట్లాడలేదు. ఆమె మనోనేత్రం ముందు స్పష్టంగాలేని ఒకస్త్రీ ఉహరూపం కనబడుతోంది. ఇందిరని చూస్తూ చంద్రశేఖర్-

"సీ, మనలైఫ్‌లో ఇదో చిన్నఫ్లాష్, అంతే !

మెరిసింది. మాయమయింది. జస్ట్ ఫర్ గెటిట్"

**ఇందిరకి ఇంకా దుఃఖం వచ్చింది. దాన్ని ఆమె ఆపుకోలేదు** ✪

# స్వతంత్రుణ్ణి



**నే**నిప్పుడు స్వతంత్రుణ్ణి

కలల్లో జీవించవచ్చు

కల్పనల నల్లనూ వచ్చు

ఇష్టమయింది వ్రాయవచ్చు

కలానికి పదును పెట్టనూ వచ్చు!

నేనిప్పుడు స్వతంత్రుణ్ణి

మదిలోతుల్ని స్పృశించవచ్చు

మానసిక ఘర్షణల నివారించనూవచ్చు

ఆత్మ సౌందర్యాన్ని ఆరాధించనూవచ్చు

అలౌకికానందన్ని పొందనూవచ్చు!

నేనిప్పుడు ఎక్కుపెట్టిన శరాన్ని

ఎగురుతున్న విహంగాన్ని

మది బాధలు ఎరిగిన వాణ్ణి

మౌనంగా వీక్షించే వాణ్ణి,

ఎందుకంటే నేనిప్పుడు **స్వతంత్రుణ్ణి!!**

\- రవీంద్రబాబు